క్లుప్తంగా

జగన్‌ను కలసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



అనంతపురం ఎడ్యుకేషన్‌: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరి సాంబశివారెడ్డి, ఆర్టీసీ జోనల్‌ మాజీ చైర్‌పర్సన్‌ మాల్యవంతం మంజుల, పెన్నోబులేసు మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీవారి ఆలయంలో కోయిల్‌ ఆళ్వార్‌ తిరుమంజనం



పూజలు చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్‌: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం కోయిల్‌ ఆళ్వార్‌ తిరుమంజనం కార్యక్రమంలో భాగంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పచ్చ కర్పూరంతో శుద్ధి చేశారు. అనంతరం స్వామి వారికి రోజువారి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌ రంగయ్య, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి సుధాకర్‌గుప్త, సభ్యులు జయంతి వెంకట్‌, సుదర్శన్‌, వేల్పూరి రవి, ప్రవీణ్‌, వీరా పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు

గుంతకల్లుటౌన్‌: స్థానిక రైల్వేస్టేషన్‌ వద్ద అనారోగ్యంతో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. వన్‌టౌన్‌ పోలీసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం మృతదేహాన్ని పాతగుంతకల్లులోని హిందూ శ్మశానవాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆ నలుగురు సేవా సమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్‌, ఉపాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, చక్రపాణి, రవీంద్ర, సభ్యులు పురుషోత్తం, మహేష్‌, ఈరమ్మ, రత్నమ్మ, లింగేష్‌, వంశీ, బాబులతో కానిస్టేబుళ్లు ఎల్లప్ప, సునీల్‌ తదితరులు పాల్గొన్నారు.

కురుబలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్సీ,ఎస్టీ సంఘాల నేతలు

గుంతకల్లు రూరల్‌: కురుబలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్‌ చేస్తూ ఎస్సీ, ఎస్టీ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎస్సీ కుల గణనలో భాగంగా కురుబలను ఎస్సీ జాబితాలోకి అక్రమంగా చేర్చారన్నారు. సామాజికంగా వెనకబడిన కులాలు, అంటరానితనానికి, వివక్షకు గురైన కులాలను మాత్రమే ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. కానీ రాజ్యాంగ విరుద్ధంగా కురుబలను ఎస్సీ జాబితాలో చేర్చారన్నారు. అధికారులు స్పందించి కురుబలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలన్నారు.

శింగనమల క్రాస్‌లో బస్టాప్‌ నిర్మిస్తాం



శింగనమల క్రాస్‌లో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

శింగనమల: శింగనమల మరువకొమ్మ క్రాస్‌లో ఆర్టీసీ బస్టాప్‌ నిర్మిస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో ఎక్కువ మంది మరువకొమ్మ క్రాస్‌లో ఎన్‌హెచ్‌ 544 డి రోడ్డు నిర్మిస్తున్నారని, బ్రిడ్జి ఏర్పాటు చేయకపోవడం, బస్టాప్‌ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వినతి పత్రాలు అందించడంతో మంగళవారం శింగనమల క్రాస్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. తహసీల్దార్‌, రోడ్డు నిర్మాణం అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇక్కడ బస్టాప్‌ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ బ్రహ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు

- అనుమతుల్లేకుండా వాటర్‌ ప్లాంట్ల ఏర్పాటు
- కానరాని బీఐఎస్‌ ప్రమాణాలు
- పట్టించుకోని పంచాయతీ, ఫుడ్‌ సేఫ్టీ అధికారులు



శింగనమల నియోజకవర్గంలో ఇలా	
మండలం	వాటర్‌ ప్లాంట్లు
గార్లదిన్నె	18
శింగనమల	16
బుక్కరాయసముద్రం	22
నార్పల	20
పుట్లూరు	14
యల్లనూరు	15



కల్లూరులో నిర్వహిస్తున్న వాటర్‌ ప్లాంటు

గార్లదిన్నె: విచ్చలవిడిగా వెలుస్తున్న నీటి శుద్ధి కేంద్రాల (ప్యూరిఫైడ్‌ వాటర్‌ ప్లాంట్ల) పై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో వాటర్‌ ప్లాంట్ల నిర్వాహకులు సరఫరా చేసిందే శుద్ధ నీరు అన్నట్లుగా ఉంటోంది. సాధారణంగా వాటర్‌ ప్లాంటు నిర్వాహకులు బ్యూర్‌ ఆఫ్‌ ఇండియన్‌ స్టాండర్స్‌ (బీఐఎస్‌) నిబంధనలు పాటించాలి. చాలా గ్రామాల్లో మినరల్‌ వాటర్‌ పేరుతో మాయాజా లం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే నీటి వ్యాపారానికి క్లెం వేయాల్సిన పంచాయతీ అధికారులు, ఫుడ్‌ సేఫ్టీ అధికారులు ఎక్కడా తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పుట్టగొడుగుల్లా వాటర్‌ ప్లాంట్లు వెలుస్తున్నా అధికారులకు కనపడటం లేదని ప్రజలు వాపోతున్నారు.

నిబంధనలు బేఖాతరు

నిబంధనల ప్రకారం వాటర్‌ ప్లాంటులో ఎయిర్‌ కండీషనర్‌తో పాటు కెమికల్‌ ల్యాబ్‌, మైక్రో బయోలాజీ ల్యాబ్‌, ఫిల్లింగ్‌ గది, బీఐఎస్‌ నిబంధనలు అనుగుణంగా ప్లాంట్‌ అంతా స్టెయిన్‌లెస్‌ స్టీల్‌తో ఉండాలి. ఇవే కాకుండా అధికారులు మూడు నెలలకోసారి ఆయా ప్లాంటులో నీటి నమూనాలు సేకరించి పలు రకాల పరీక్షలు నిర్వహించాలి. సంతృప్తికరంగా ఉంటేనే లైసెన్సులు ఇవ్వడం, అంతకుముందు ఉంటే కొనసాగించడం వంటివి చేస్తారు. అలాగే ప్లాంట్‌ నిర్వహణతో పాటు ప్యాకెట్లు, బాటిళ్ల తయారీకి కూడా ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రమాణాలు పాటించని ప్లాంటపై ప్రివెన్షన్‌ ఆఫ్‌ ఫుడ్‌ అడల్ట్రేషన్‌ యాక్ట్‌ 1954 ప్రకారం అధికారుల కేసులు నమోదు చేయాలి. ఇప్పటి వరకు ఎక్కడా పంచాయతీ అధికారులు, ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్లు ప్రమాణాలు పరిశీలించిన దాఖలాలు లేవు.

అనారోగ్యం బారిన ప్రజలు

రంగు లేని నీరు కాస్తంత తియ్యగా ఉంటే చాలు ననే ఉద్దేశంతో శుద్ధనీరు తయారీ కేంద్రంను నడిపేస్తున్నారు. నిబంధనలు మేరకు నీటిని శుభ్రం చేయకుండానే విక్రయిస్తున్నారు. కొన్న శుద్ధ నీటిని రెండు రోజులు ఇంట్లో ఉంచితే చిన్న, చిన్న క్రిములు తయారవుతున్నాయని పలువురు మహిళలు వాపోతున్నారు. అలాంటి నీటిని తాగడం వల్ల కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. అంతే కాకుండా టైఫాయిడ్‌, కామెర్లు, చర్మ సంబంధిత ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టి శుద్ధ నీరు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వాటర్‌ ప్లాంట్లు తనిఖీ చేయాలి



మండలంలో చాలా గ్రామాల్లో ప్యూరిఫైడ్‌ నీటి కేంద్రాలు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నిబంధనలు పాటించకుండా నీరు విక్రయిస్తున్నారు. అధికారులు పర్యవేక్షించి, నీరు తాగవచ్చా ? లేదా అని నిర్ధారించాలి. ఇప్పటి వరకు ఒక్క అధికారి కూడా వాటర్‌ ప్లాంట్లు తనిఖీ చేయలేదు. శుద్ధ నీటిలో చిన్నచిన్న క్రిములు వస్తున్నాయి. ప్లాంట్లలో శుద్ధి చేసిన నీటినే విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – అక్బర్‌, కోటంక

వ్యాధులు ప్రబలే అవకాశం



నీటిని ప్యూరిఫైడ్‌ కేంద్రాల్లో క్లోరిఫికేషన్‌ చేసి ప్రజలకు విక్రయించాలి. శుద్ధి చేసిన నీటిని మాత్రమే ప్రజలు తాగాలి. కలుషిత నీరు తాగితే జ్వరం, వాంతులు, విరేచనాలు, వంటి రోగాలు వస్తాయి. ప్రతి బుధవారం వైద్య సిబ్బంది గ్రామాల్లో తాగు నీరు తనిఖీ చేసి నీటిని సర్టిఫై చేస్తాం. ఆరు నెలలు క్రితం ఓ గ్రామంలోని వాటర్‌ ప్లాంటులో నీరు కలుషితం అయినట్లు గుర్తించి వాటర్‌ ప్లాంటు మూసి వేశాం. – దిలీప్‌కుమార్‌, యర్రగుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి

గుత్తిలో సినిమా షూటింగ్‌



సినిమా షూటింగ్‌ దృశ్యం

గుత్తి: పట్టణంలో మంగళవారం అనన్య క్రియేషన్స్‌ పతాకంపై నిర్మిస్తున్న తెరచాప సినిమా షూటింగ్‌ జరిగింది. పట్టణంలోని ఎంఎస్‌ హైస్కూల్లో పలు సన్ని వేశాలు చిత్రీకరించారు. ఇద్దరు వ్యక్తులను విలన్‌ రాజేష్‌ నాయక్‌ మనుషులు ఎత్తుకొచ్చి కింద పడేసి కొడుతున్న సన్ని వేశంతో పాటు హీరో నవీన్‌రాజు పేదల సమస్యలను పరిష్కరించే సన్నివేశాన్ని చిత్రీకరించారు. షూటింగ్‌ వీక్షించడానికి జనాలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్‌ జాన్‌ జోయల్‌, నిర్మాత దుర్గం కైలాష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఏడీసీసీ బ్యాంకు నూతన భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న జేసీ శివన్నారాయణశర్మ

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో మంగళవారం ఏడీసీసీ బ్యాంకు నూతన భవనాన్ని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ శివన్నారాయణశర్మ రిబ్బన్‌ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన బ్యాంకు భవనంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవ్‌బాబు, రాంప్రసాద్‌, నాబార్డు అధికారి అనురాధ, స్థానిక బ్యాంకు మేనేజర్‌ జానకిరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు వేగవంతంగా పరిష్కరించాలి



గార్లదిన్నె మండలం మర్తాడులో మాట్లాడుతున్న అసిస్టెంట్‌ కలెక్టర్‌ వినూత్న



గుంతకల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గార్లదిన్నె/గుంతకల్లు రూరల్‌/శింగనమల/పెద్దవడుగూరు/పామిడి: రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీ సకాలంలో పరిష్కరించాలని అసిస్టెంట్‌ కలెక్టర్‌ వినూత్న సూచించారు. మంగళవారం గార్లదిన్నె మండలం మర్తాడులో అధికారులు నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఫిర్యాదుదారులతో మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందదన్నారు. అలాగే రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీ పరిశీలించి, సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మండల వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ముగిశాయని, ఇప్పటి వరకు 114 అర్జీలు రాగా 22 అర్జీలు పరిష్కరించినట్లు తహసీల్దార్‌ ఈరమ్మ తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

☛ గుంతకల్లు మండలంలోని గుండాల తండా గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఎక్కడైనా భూ కబ్జాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టిని సారించాలని, అలాకాకుండా లంచాలు తీసుకున్నట్లు తేలితే ఏసీబీకి పట్టిస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

☛ శింగనమల మండలంలోని నాయనవారిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ బ్రహ్మయ్య, మండల సర్వేయర్‌ స్టీఫెన్‌ వరకుమార్‌, ఫారెస్ట్‌ అధికారి రాంమోహన్‌, వీఆర్‌ఓ నాగేంద్ర, దాదాపీరా, ఇన్‌చార్జి సర్వేయర్‌ శివానంద, రైతులు పాల్గొన్నారు.

☛ పామిడి మండలంలోని నెమళ్లపల్లి, సొరకాయలపేట గ్రామాల్లో తహసీల్దార్‌ శ్రీధరమూర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇప్పటిదాకా 365 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్‌ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్‌ మురళీధర్‌, దేవదాయశాఖ ఈఓ క్రిష్ణయ్య, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

☛ పెద్దవడుగూరు మండలంలోని లక్ష్మంపల్లి, ముప్పాలగుత్తి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇప్పటి వరకూ మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 214 అర్జీలు రాగా ఇప్పటికే 55కు పైగా సమస్యలను పరిష్కరించినట్లు తహసీల్దార్‌ ఉషారాని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్‌ ప్రసాద్‌, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

గుంతకల్లుటౌన్‌: ముస్లింల ఆరాధ్యదైవమైన హజరత్‌ ఖాజా గరీబ్‌ నవాజ్‌ దర్గా 813వ ఉరుసు ఉత్సవాల సందర్భంగా జమాతే ఖుద్దాముల్‌ ముస్లిమీన్‌ వెల్ఫేర్‌ కమిటీ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. మంగళవారం రీగల్‌ టాకీస్‌ మదీనా ఆర్చ్‌ ఎదురుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం అన్నదానం చేశారు. ఖుద్దాముల్‌ కమిటీ అధ్యక్షుడు ఎస్‌ఎండీ రఫీ, సభ్యులు నౌషద్‌, జలీల్‌, ఖాజా, శర్మస్‌, ఖదీర్‌, షబ్బీర్‌, అబ్దుల్‌, నిసార్‌, రహంతుల్లా, మహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్‌

తాడిపత్రిటౌన్‌: పట్టణంలోని నంద్యాల రోడ్డులో మట్కా నిర్వహిస్తున్న జయరాం రెడ్డి అనే వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్ట్‌ చేశారు. పోలీస్‌ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించిన సీఐ సాయి ప్రసాద్‌ వివరాలను వెల్లడించారు. నిందితుడి నుంచి రూ.30వేల నగదు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గౌస్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

'పది' పరీక్షలపై ప్రత్యేక దృష్టి

పెద్దవడుగూరు: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్‌ పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్‌ సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దవడుగూరు, లక్ష్మంపల్లి జెడ్పీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌బాబు, హరినాథ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు వీడాలి

తాడిపత్రిటౌన్‌: ప్రతి ఒక్కరూ మూఢ నమ్మకాలు వీడి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక తాడిపత్రి కన్వీనర్‌ రమేష్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మోడల్‌స్కూల్‌లో జేవీవీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జేవీవీ లక్ష్యాలు, కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం మ్యాజిక్‌ షో, గీతాలాపన చేశారు. జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు రమణయ్య, కల్చరల్‌ కమిటీ నాయకుడు వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి హరేరామ, ప్రిన్సిపాల్‌ లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానులే



మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి శివ ప్రసాద్‌

బుక్కరాయసముద్రం: చట్టం దృష్టిలో అందరూ సమానులే అని జిల్లా లీగల్‌ సర్వీస్‌ అథారిటీ, సీనియర్‌ సివిల్‌ జడ్జి శివప్రసాద్‌ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కేంద్రంలో జిల్లా లీగల్‌ సర్వీస్‌ అథారిటీ ఆధ్వర్యంలో చట్టాలపై ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మహిళలు, బాలికలు చట్టాలపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. స్కానింగ్‌ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుంటే కోర్టు దృష్టికి తీసుకురావాలన్నారు. కోర్టులలో నిరుపేదలందరికీ ఉచిత న్యాయం అందించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ స్వాతిలక్ష్మి, పీహెచ్‌ఎన్‌ చెన్నమ్మ, నాగలక్ష్మి, ఫాతిమా, ధనుంజయ, శివా నంద, సచివాలయ మహిళా ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి





మోదీ గో బ్యాక్‌ అంటూ గుంతకల్లు, గుత్తిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్‌/గుత్తి: రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలను అమలు చేయలేని ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హత లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి అన్నారు. మోదీ గో బ్యాక్‌ అంటూ మంగళవారం సీపీఎం నాయకులు పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకపోగా ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు. విజభన హామీలు అమలు చేయకుండా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులివ్వకుండా ఏ ముఖం పెట్టుకుని మోదీ రాష్ట్రంలో పర్యటిస్తారని వారు ప్రశ్నించారు. ఏపీ ప్రజలను మోదీ సర్కారు దగా చేస్తున్నా ప్రశ్నించాల్సిన టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీ సేవలో తరించడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. తెలుగుప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న మోదీకి ఈ నెల 8న రాష్ట్రంలో అడుగు పెట్టే హక్కులేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, రమేష్‌, రంగమ్మ, జగ్గిలి రమేష్‌, సురేంద్ర, చంద్రశేఖర్‌, రామునాయక్‌ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తిలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల ఆధ్వర్యంలో గాంధీ సర్కిల్‌ వద్ద నిరసన వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేశాకే మోదీ ఏపీలో అడుగు పెట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామకృష్ణ, మల్లికార్జున, రేణుక, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

మెకానిజంపై అవగాహన పెంచుకోవాలి



సర్టిఫికెట్లతో విద్యార్థులు

బుక్కరాయసముద్రం: బీటెక్‌ విద్యార్థులు మెకానిజంపై అవగాహన పెంపొందించుకోవాలని సౌత్‌ రీజియన్‌ ఫామ్‌ మిషనరీ ట్రైనింగ్‌, టెస్టింగ్‌ ఇనిస్టిట్యూట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ బీఎం నందేడే సూచించారు. మంగళవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్‌) ఇంజినీరింగ్‌ కళాశాలలో మెకానికల్‌ ఇంజినీరింగ్‌ విభాగం ద్వితియ సంవత్సరం విద్యార్థులు గార్లదిన్నెలోని సౌత్‌ రీజియన్‌ ఫామ్‌ మిషనరీ ట్రైనింగ్‌, టెస్టింగ్‌ ఇనిస్టిట్యూట్‌లో వారం రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అగ్రికల్చర్‌కు మిషన్స్‌కు సంబంధించిన విడి విభాగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఇంజన్‌ డిసేబుల్‌, అసెంబుల్‌ గురించి అగ్రికల్చర్‌ ఇంజినీరు నితీష్‌కుమార్‌ వర్మ వివరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ బాలక్రిష్ణ, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌, వైస్‌ ప్రెసిండెట్‌ డాక్టర్‌ రంజిత్‌రెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్‌ డాక్టర్‌ సాయిచైతన్యకిషోర్‌, మెకానికల్‌ విభాగం అధిపతి డాక్టర్‌ వంశీకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

గుత్తి రూరల్‌: మండలంలోని టి.కొత్తపల్లి, కొజ్జేపల్లి గ్రామ శివారులో 67వ నంబర్‌ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు. మండలంలోని టి.కొత్తపల్లి శివారులో బొగ్గుల బట్టీలో పని చేసే రమేష్‌ నడుచుకుంటూ వెళ్తున్నాడు. తొండపాడుకు చెందిన మధు, రంగప్ప గుత్తికి బైక్‌లో వెళ్తూ రమేష్‌ను వెనుక నుంచి వేగంగా వెళ్లి ఢీకొన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ప్రమాదంలో కొజ్జేపల్లి గ్రామ శివారులో రోడ్డు డైవర్షన్‌ వద్ద మట్టి కుప్పను గమనించకుండా వెళ్లి ద్విచక్రవాహనాన్ని ఎక్కించి అదుపు తప్పి బోల్తా పడటంతో మండలంలోని లచ్చానుపల్లిలో జరిగే బీరప్ప స్వామి ఉత్సవాలకు వస్తున్న దర్గాహోన్నూరుకు చెందిన వన్నూరు స్వామి, హనుమంతు రాయుడు, తిప్పేష్‌ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు మధును అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంఈఓ నవీద సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఇనిస్టిట్యూట్‌ ఫర్‌ గ్లోబల్‌ డెవలప్‌మెంట్‌ వారి ఆధ్వర్యంలో స్మార్ట్‌ ఆశీర్వాద్‌ ప్రాజెక్ట్‌లో భాగంగా ఐటీసీ సహకారంతో విద్యార్థులకు ఆహారం, ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్‌ పార్వతి, ఎంపీపీ సునీత, ఎంఈఓ నవీద మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత రంగాలలో రాణించాలన్నారు. తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం వసుంధర, ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారి రామాంజనేయులు, దరగయ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో ట్రాన్స్‌కో ఉద్యోగి మృతి



సునీల్‌ విజయ రాజు(ఫైల్‌)

గుత్తి: పట్టణంలోని ఉప్పర వీధికి చెందిన ట్రాన్స్‌కో కాంట్రాక్ట్‌ ఉద్యోగి (టెక్నికల్‌ అసిస్టెంట్‌) సునీల్‌ విజయ రాజు(45) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. గుండెపోటు రావడంతో ఆయన ఇంట్లో కుప్పకూలి కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

10న సార్థ జ్ఞానేశ్వరి పారాయణం

పామిడి: పట్టణ చిన్న విఠోబ దేవాలయంలో రంగసుభేఫిర్కా ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈనెల 10న ఉదయం 6 గంటలకు శ్రీ సార్థ జ్ఞానేశ్వరి 9వ అధ్యాయ పారాయణం ఉంటుందని భావసార క్షత్రియ భజన మండలి సభ్యులు మంగళవారం తెలిపారు. భక్తులు పారాయణం కోసం శ్రీ సార్థ జ్ఞానేశ్వరి 9వ అధ్యాయ గ్రంథంను వెంట తెచ్చుకోవాలన్నారు. ఉదయం 10 గంటలకు రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో చిన్న విఠోబ ఆలయం నుంచి నగర ప్రదక్షిణ ఉంటుందన్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు పెద్ద విఠోబ దేవాలయం నుంచి నిర్వహించే ఈ కార్యక్రమాల్లో భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

మురుగు శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు స్థల పరిశీలన

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో మురుగు శుద్ధి కేంద్రం ఏర్పాటు కోసం మంగళవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. పబ్లిక్‌ హెల్త్‌ ఈఈ ఆదినారాయణ, మున్సిపల్‌ డీఈ హేమచంద్ర తదితరులు రెండు ప్రాంతాల్లో స్థలాన్ని పరిశీలించారు. త్వరలో మురుగు శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.

లింగ వివక్ష నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

బుక్కరాయసముద్రం: సమాజంలో లింగ వివక్షత నిర్మూలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సీడీఎస్‌ పీడీ వనజా అక్కమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్‌ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎం, మహిళా పోలీస్‌, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో లింగ వివక్ష నిర్మూలనపై, బాలికలకు పౌష్టిక ఆహారం ఆవస్యకత, రక్తహీన నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ సాల్మాన్‌, సీఐ కరుణాకర్‌, సీడీపీఓ ఉమా శంకరమ్మ, డాక్టర్‌ శ్రీదేవి, ఈఓఆర్డీ సదాశివం, ఎంఈఓ నవీద, సీహెచ్‌ఓ మోహన్‌, ఏపీఎం నారాయణస్వామి, హేమలత, భారతి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.